క్లుప్తంగా

నృసింహుని సేవలో ఎస్పీ



ఎస్పీ అశోక్‌కుమార్‌కు స్వామివారి చిత్రపటం బహూకరిస్తున్న ఆలయ సిబ్బంది

ధర్మపురి: జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ అశోక్‌కుమార్ మంగళవారం ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఎస్పీకి ఆలయం పక్షాన సంప్రదాయ రీతుల్లో మేళతాళాలతో స్వాగతం పలికారు. ఆలయ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ స్వామివారి శేషవస్త్రం కప్పి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో సీఐ రామ్‌నర్సింహారెడ్డి, ఎస్సైలు ఉదయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులు



సహస్ర



వైష్ణవి



ధర్మతేజ

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థులు జాతీయ స్కాలర్‌షిప్‌కు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ నవీన్ మంగళవారం తెలిపారు. ఎస్. సహస్ర , డి. వైష్ణవి, ఎల్. ధర్మతేజ ఎంపిక కాగా, ఈ విద్యార్థులకు సంవత్సరానికి రూ. 12వేల చొప్పున 4 ఏళ్లకు రూ. 48వేలు అందుతాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ నవీన్, ఉపాధ్యాయులు అందించారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ భీమేశ్వరి

ఇబ్రహీంపట్నం: తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని ఎంపీపీ జాజాల భీమేశ్వరి కోరారు. మంగళవారం మండలంలోని గోధూర్‌లో బడిబాటలో భాగంగా మహిళా సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. గోధూర్‌లో ప్రాథమిక పాఠశాల, హైస్కూల్‌లో పిల్లల సంఖ్య తగ్గిందని, మన ఊరు మన బడిని కాపాడుకునేందుకు పిల్లల సంఖ్యను పెంచాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజన్న, ఏఎన్ఎం పద్మ, వీడీసీ అధ్యక్షుడు ఓంకారి లక్ష్మణ్, జగన్‌రావు, మధు, నరేశ్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మహిళల రక్షణ చట్టాలపై అవగాహన

ధర్మపురి: బుగ్గారం మండలంలోని చిన్నాపూర్‌లో మహిళల రక్షణ చట్టాలు, వివిధ సామాజిక అంశాలపై మంగళవారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈసందర్భంగా జెండర్ స్పెషలిస్టు గౌతమి మాట్లాడుతూ మహిళా సాధికారత, భేటీ బచావో భేటీ పడావో గురించి వివరించారు. సమాజంలో జరిగే బాల్య వివాహాలు, మహిళల రక్షణ చట్టాలు, సఖీ సే వలు, అంగన్‌వాడీల సేవలు, చైల్డ్ హెల్ప్‌లైన్, సీని యర్ సిటిజన్ల రక్షణ చట్టాలపై వివరించారు. కార్యక్రమాల్లో మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మల్లాపూర్: మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన చందనగిరి శ్రీనివాస్ గల్ఫ్ దేశానికి వలస వెళ్లి ఆర్థిక సమస్యలు, అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నిరుపేద కుటుంబం కావడంతో మంగళవారం బీజేపీ ఎన్ఆర్ఐ సెల్ ఆధ్వర్యంలో రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ ఎన్ఆర్ఐ సెల్ నాయకుడు వంశీగౌడ్, బాలసాని లక్ష్మీనారాయణగౌడ్, వీవీరావుపేట గల్ఫ్ ఉపాధ్యక్షుడు ఆరెల్లి మహేశ్, వంశీ, పెనుకుల నరేష్, వేముల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

వాళ్లు నాటుడు.. వీళ్లు నరుకుడు

- హరితహారం మొక్కలు నరికివేత
- రహదారికిరువైలా మొండి చెట్లు దర్శనం
- విద్యుత్ తీగలకు అడ్డొస్తున్నాయనే..
- ప్రజాధనం వృథాపై విమర్శలు



పై ఫొటోలో కనిపిస్తున్న నరికేసిన చెట్లు మెట్‌పల్లి మండలంలోని వెల్లుల్ల శివారులోనివి. హరితహారంలో నాటిన మొక్కలను ఇష్టారీతినా నరికివేస్తున్నారు. ఎక్కడ చూసినా నరికివేసిన చెట్లే కనిపిస్తున్నాయి. చెట్లను నరికివేయకుండా అధికారులు దృష్టి సారించి పచ్చదనాన్ని పెంపొందించాలని, ఏపుగా పెరిగిన చెట్లను నరికివేయడం సరికాదని ఇటీవల నిర్వహించిన మెట్‌పల్లి మండల సర్వసభ్య సమావేశంలో పలువురు ఎంపీటీసీలు లేవనెత్తారు.

మెట్‌పల్లిరూరల్: పచ్చదనాన్ని పెంపొందించేందుకు గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం అభాసుపాలవుతోంది. మొక్కలు నాటి వాటిని సంరక్షించిన అధికారులు, మరో వైపు విద్యుత్ అధికారులు ఏపుగా పెరిగిన చెట్లను నరికివేస్తున్నారు. లక్షలాది రూపాయల నిధులు ఖర్చు చేసి మొక్కలను సంరక్షించినా విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్నాయని అధికారులు నరికించేస్తున్నారు. లక్షలాది ప్రజాధనం వృథా కావడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎక్కడైనా చెట్లకొమ్మలను నరికివేస్తేనే జరిమానా విధించే అధికారులు ఇంత పెద్దఎత్తున చెట్లు నరికివేస్తున్నా..అటువైపు కన్నెత్తి చూడకపోవడం విడ్డూరం.

రహదారికి ఇరువైపులా చెట్లు నరికివేత..

మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో రహదారికిరువైపులా హరితహారంలో భాగంగా ఏళ్ల కిందట మొక్కలు నాటారు. ప్రస్తుతం అవి ఏపుగా పెరిగాయి. అయితే చెట్లు ఏపుగా పెరగడమే అసలు సమస్యగా మారింది. ఆ ప్రాంతంలో విద్యుత్ తీగలకు చెట్లు అడ్డువస్తున్నాయనే కారణంతో విద్యుత్ శాఖ అధికారులు అడ్డూ అదుపులేకుండా నరికివేయించారు. తీగలకు అడ్డువస్తున్న చెట్ల కొమ్మలను నరికితే సరిపోయేదానికి చెట్ల మొదళ్ల నుంచి ఇష్టారీతినా నరికివేయించారు. దీంతో పలు గ్రామాల్లో రహదారులకిరువైపులా నరికివేసిన చెట్లే దర్శనమిస్తున్నాయి.

అభ్యంతరం చెప్పకపోవడంతో..

హరితహారంలో నాటిన చెట్లను విచ్చలవిడిగా విద్యుత్ శాఖ అధికారులు నరికివేయించిన మండల పరిషత్ అధికారులు, స్థానిక పంచాయతీ కార్యదర్శులు అడ్డుకుని అభ్యంతరం చెప్పాల్సి ఉండగా, ఆ విషయంలో ఉదాసీన వైఖరి అవలంభించినట్లు తెలిసింది. ఈ కారణంగానే విద్యుత్‌శాఖ అధికారులు సైతం ఇష్టారీతిన చెట్లను నరికివేయించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా చెట్లు నరికివేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం

చెట్లు నరికివేయకుండా జాగ్రత్తలు పడుతున్నాం. కొన్ని చోట్ల చెట్లు నరికివేసినట్లు మా దృష్టికి వచ్చింది. నరికివేసిన చెట్ల విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం.

– రామకృష్ణ, ఇన్‌చార్జి ఎంపీడీవో,మెట్‌పల్లి

వానాకాలం సాగులో పద్ధతులు పాటించాలి

ఇబ్రహీంపట్నం: వానాకాలం సాగులో రైతులు వివిధ పద్ధతులు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్త ఎల్ కృష్ణ రైతులకు అవగాహన కల్పించారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. వివిధ రకాల వరి వంగడాలు, కొత్తగా విడుదల చేసిన వరి విత్తనాల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో డీఏవో వాణి, ఏవో దీపిక, ఏఈవోలు నరేశ్, రవళిక, హరీశ్, శ్యామ్, రైతులు పాల్గొన్నారు.

జీలుగు పంట పరిశీలన

మండలకేంద్రంలో జీలుగు పంటను జిల్లా వ్యవసాయ అధికారి వాణి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీలుగు పంట 45 రోజులకు వచ్చిన పిదప పూత దశలోకి రాగానే భూమిలో కలియదున్నాలని, దీంతో భూమి సారవంతంగా మారి, పంట దిగుబడి పెరుగుతుందని రైతులకు తెలిపారు. ఆమె వెంట వ్యవసాయ అధికారులు ఉన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో డీఏవో వాణి, రైతులు

అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి

సారంగాపూర్: రైతులు శాస్త్రవేత్తలు ఇచ్చిన సూచనలు, సలహాలు పాటిస్తే పంటల్లో మంచి దిగుబడి సాధించవచ్చని వ్యవసాయాధికారి తిరుపతినాయక్ అన్నారు. మంగళవారం సారంగాపూర్ రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు వానాకాలం వరిసాగు, వర్షాధార మొక్కజొన్నలో రైతులు చేపట్టాల్సిన చర్యలు, సేంద్రియ వరిపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈవో వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

క్రీడలు స్నేహ భావాన్ని పెంపొందిస్తాయి

ధర్మపురి: క్రీడలు స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని సీఐ రామ్ నర్సింహారెడ్డి అన్నారు. ధర్మపురి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మంగళవారం పోలీసులు, పాత్రికేయుల మధ్య ఫ్రెండ్లీ క్రికెట్‌మ్యాచ్‌ను నిర్వహించారు. మ్యాచ్‌లో పోలీస్ జట్టు విజయం సాధించగా ప్రాత్రికేయుల జట్టు రన్నరప్‌గా నిలిచింది. గెలిచిన జట్టులో విన్నర్ కప్‌తో పాటు మ్యాచ్‌లో ప్రతిభ కనపర్చిన ధర్మపురి ఎస్సై ఉదయ్‌కుమార్, కానిస్టేబుల్ రమేశ్, రాము, చక్రిలకు షీల్డ్సును అందజేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ప్రజా క్షేత్రంలో కీలక పాత్ర పోషిస్తున్న పాత్రికేయులు, పోలీసులకు మధ్య క్రికెట్ టోర్నీ నిర్వహించడం ఎంతో సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.



విన్నర్ కప్‌ను అందిస్తున్న సీఐ

నట్టల నివారణ మందుల పంపిణీపై అవగాహన

కథలాపూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలకు మంగళవారం నట్టల నివారణ మందుల పంపిణీపై అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సింధూజ మాట్లాడుతూ ఈనెల 20న 1–19 ఏళ్ల లోపు వారికి నట్టల నివారణ మందులు వేయాలన్నారు. కథలాపూర్ పీహెచ్‌సీ పరిధిలో 6 వేల మంది, అంబారిపేట పీహెచ్‌సీ పరిధిలో 6 వేల మంది ఉన్నట్లు తెలిపారు. వందశాతం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, హెల్త్ సూపర్‌వైజర్ భూషణ్ పాల్గొన్నారు.

పెగడపల్లి: నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ విజయవంతానికి అధికారులు సహకరించాలని వైద్యాధికారి నరేశ్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వైద్య సిబ్బంది, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి నరేశ్ మాత్రల పంపిణీపై వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో మహేందర్, ఐడీడీఎస్ సూపర్‌వైజర్ సుభద్ర, సీహెచ్‌వో మహేందర్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి సింధూజ

గొల్లపల్లి: ఒకటి నుంచి 19 ఏళ్లలోపు వయస్సు గల పిల్లలు ప్రతి ఒక్కరికీ నులిపురుగుల మాత్రలు వేయాలని మండల వైద్యాధికారి నరేశ్ అన్నారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించారు.ఈనెల 20న నులిపురుగుల నివారణ మాత్రలను ప్రతి ఒక్కరికి వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాంరెడ్డి, సీహెచ్‌వో గట్టు శ్రీధర్, సూపర్‌వైజర్ నరేందర్, రమేష్, శారద పాల్గొన్నారు.

బస్ సౌకర్యం కోసం ఎమ్మెల్యేకు వినతి

కథలాపూర్: మండలంలోని తాండ్ర్యాల, గంభీర్‌పూర్ రూట్‌లో బస్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు విన్నవించినట్లు తాండ్ర్యాల మాజీ సర్పంచ్ గడీల గంగప్రసాద్ మంగళవారం తెలిపారు. గతంలో ఈ రూట్‌లో బస్సు 8 ట్రిప్పులు వచ్చేదని, ప్రస్తుతం 4 ట్రిప్పుల బస్ సౌకర్యం ఉండటంతో ప్రయాణికులకు ఇబ్బందిగా ఉందన్నారు. కథలాపూర్ నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు మరో ట్రిప్పు బస్ సౌకర్యం కల్పించాలని వినతిపత్రం ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

కట్కాపూర్‌కు బస్సు నడిపించాలి

రాయికల్: రాయికల్ పట్టణం నుంచి కట్కాపూర్ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ మంగళవారం గ్రామానికి చెందిన మహిళలు కార్యదర్శి రాజేశ్‌కు వినతిపత్రం సమర్పించారు. రాయికల్ నుంచి కట్కాపూర్‌కు బస్సులు లేకపోవడంతో విద్యార్థులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సు సౌకర్యం కల్పించాలని, లేనిపక్షంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళలు సుజాత, భాగ్యలక్ష్మి, లావణ్య, జల,లక్ష్మి, భాగ్య, పర్వీన్ బేగం పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీ

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వెల్లుల,బండలింగాపూర్ గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాల్లో మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి వాణి తనిఖీ చేపట్టారు. ఫర్టిలైజర్ దుకాణాలకు లైసెన్స్‌లు ఉన్నాయా,లేవా అని తెలుసుకున్నారు. విత్తనాలు కొన్న ప్రతీ రైతుకు తప్పనిసరిగా రశీదును అందించాలని సూచించారు. అలాగే ఓ ఫర్టిలైజర్ దుకాణంలో పురుగుల మందులు అమ్ముతున్నట్లు గుర్తించి అమ్మవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈవోలు పాల్గొన్నారు.

టిప్పర్ల యజమానులకు జరిమానా

మల్యాల: అక్రమంగా వరదకాలువ మట్టి తరలిస్తున్న టిప్పర్ల యజమానులకు తహసీల్దార్ జరిమానా విధించారు. మల్యాల మండలంలోని వరదకాలువ నుంచి అక్రమంగా మట్టి తరలిస్తుండగా రెండు రోజుల క్రితం పోలీసులు పట్టుకుని, రెవెన్యూ అధికారులకు మంగళవారం అప్పగించారు. దీంతో తహసీల్దార్ మునీందర్ ఒక్కో టిప్పర్ యజమానికి రూ.10వేల చొప్పున జరిమానా విధించారు.

కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా కార్యదర్శిగా బాలయ్య

మెట్‌పల్లి: కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా కార్యదర్శిగా మండలంలోని బండలింగాపూర్‌కు చెందిన గంగోని బాలయ్యను నియమించారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయం జిల్లా అధ్యక్షుడు అందె మారుతి బాపూజీ ఆయనకు అందజేశారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా బాలయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కొమిరెడ్డి లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మీ నృసింహ హోమం



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం మహాలక్ష్మి నృసింహ మహాయజ్ఞం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వాతి నక్షత్రంను పురస్కరించుకొని లోక కల్యాణార్థం ఏటా నృసింహ క్షేత్రాల్లో మహాలక్ష్మి నృసింహ మహాయజ్ఞం నిర్వహిస్తారు. ఈసందర్భంగా ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచనల మేరకు శ్రీమాన్ భాగవతుల వంశీకృష్ణమాచార్యస్వామి ఆధ్వర్యంలో నేరెల్ల శ్రీనివాసచార్యుల మంత్రోచ్ఛరణలతో వైభవంగాజ్ఞంనిర్వహించారు. అలాగే ఉగ్రనృసింహస్వామి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రమై స్వాతి నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.



పూజలో పాల్గొన్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువకులకు సన్మానం



యువకులను సన్మానించిన గ్రంథాలయ బాధ్యులు

కోరుట్ల: పట్టణానికి చెందిన ఏడుగురు యువకులు ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాధించగా వారిని సీ. ప్రభాకర్ స్మారక గ్రంథాలయం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత స్టడీ సెంటర్‌లో చదువుకుని ఉద్యోగాలు సాధించటం అభినందనీయమన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన లగిశెట్టి నరేందర్, నారవేణి వేణు, కుందారపు విజయ్, జిందం అజయ్ కుమార్, వాసం సంజయ్ కుమార్, బోగె అశోక్, వద్లకొండ సంజయ్ కుమార్‌ను సత్కరించి, మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ గౌరవ అధ్యక్షుడు చెన్న విశ్వనాథం, అధ్యక్షుడు రాస భూమయ్య, ఉపాధ్యక్షుడు సుతారి రాములు, అన్నం లనిల్, మౌలానా, భూమేశ్వర్, గంగమణి పాల్గొన్నారు.

ముగిసిన డీపీఎల్ క్రికెట్ టోర్నీ

ధర్మపురి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో లకెట్టి మహేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారంతో ముగిసింది. టోర్నీలో అప్పం తిరుపతి జట్టు విన్నర్‌గా, మహేశ్ 11 జట్టు రన్నర్‌గా గెలుపొందింది. విన్నర్ జట్టుకు రూ.18 వేలు, రన్నర్ జట్టుకు రూ.12 వేలు నగదు, అవార్డు కప్, షీల్డును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ దినేశ్, వేముల నాగలక్ష్మి, చీపిరిశెట్టి రాజేశ్, శివ కుమార్, ఉప్పుల రాకేశ్, షబ్బీర్ పాల్గొన్నారు.

శిలాఫలకాలు ధ్వంసం చేయడం సరికాదు

కోరుట్ల రూరల్: మండలంలోని నాగులపేటలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల సమయంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలను కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం మాట్లాడుతూ గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి వాళ్ల పేర్లు పెట్టుకోవాలే గాని ఉన్న వాటిని పగుల గొడితే ప్రజలే సరైన బుద్ధి చెపుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వెల్లుల్ల పెద్ద చెరువు ఆక్రమణలను అరికట్టాలి

మెట్‌పల్లి: మండలంలోని వెల్లుల్ల పెద్ద చెరువు ఆక్రమణలను అరికట్టాలని కోరుతూ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. చెరువు స్థలాల ఆక్రమణలతో గంగపుత్రుల ఉపాధి దెబ్బతింటుందన్నారు. సుమారు 300 కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని అక్రమణలను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కంతి హరికుమార్,లక్కంపెల్లి రమేశ్, తేల రాజయ్య, నరసయ్య, నరేందర్, రమేశ్ తదితరులు ఉన్నారు.



ఘనంగా ఎల్లమ్మ బోనాలు

ధర్మపురి: మండలంలోని నేరెళ్లలో మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రేణుకాఎల్లమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు బ్యాండు మేళాలు, బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ఎల్లమ్మతల్లికి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జాజాల రమేష్,జాజాల శంకర్, పాదం చెంద్రయ్య, కరవత్తుల నాగరాజు తదితరులున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే చౌరస్తా వద్ద ఉన్న హైమాస్ట్ లైట్ల స్తంభం ఓ పక్కకు వంగి ఉంది. ఈ వానాకాలంలో ఈదురు గాలుల వర్షం వస్తే స్తంభం విరిగి పడే ప్రమాదముంది. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి హైమాస్ట్ లైట్ల స్తంభాన్ని మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



ఆర్డీవో కార్యాలయం ఎదుట స్వర్ణకారుల ఆందోళన



మెట్‌పల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న స్వర్ణకారులు

మెట్‌పల్లి: పోలీసులు తమపై అక్రమ కేసులు పెట్టడాన్ని ప్రభుత్వం నియంత్రించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట మంగళవారం స్థానిక స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, దొంగ బంగారం రికవరీ పేరుతో చాలా చోట్ల స్వర్ణకారులపై పోలీసులు కేసులు పెడుతూ వేధింపులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని వీటిని అరికట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం ఇచ్చారు. అంతకు ముందు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాంపల్లి సింహాద్రి, నాంపల్లి మారుతి, ఇల్లెందుల శ్రీధర్, దురిశెట్టి నటరాజ్, నాంపల్లి సంజీవ్, ఇందూరి గిరిధర్, తునికి ఆనంద్, భూమయ్య పాల్గొన్నారు.

లోక్యానాయక్ తండాలో పస్క వేడుకలు



పూజలు నిర్వహిస్తున్న గిరిజనులు

రాయికల్: వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ రాయికల్ మండలం లోక్యానాయక్‌తండాలో గిరిజనులు పస్క వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన శక్తి జిల్లా అధ్యక్షుడు భూక్య సంతోష్‌నాయక్, రవినాయక్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రాజునాయక్, అర్జున్‌నాయక్, రతిన్‌లాల్‌నాయక్, తిరుపతి, బాపురావు తదితరులు పాల్గొన్నారు.